
సాక్షి
పల్నాడు
ఆదివారం । 2 । మార్చి । 2025



నేతి వెంకన్న స్వామికి నీరాజనాలు

రాజుపాలెం: దేవరంపాడు కొండపై వెలసిన నేతి వెంకన్న స్వామి మొదటి శనివారం తిరునాళ్లకు భక్తులు పోటెత్తారు. నెయ్యి, బెల్లం, కంది పప్పు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 529.20 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 6,006 క్యూసెక్కులు విడుదలవుతోంది.

గ్రంథం ఆవిష్కరణ



పొన్నూరు: పట్టణంలోని లుంబినీవనం అంబేడ్కర్ రీసెర్చ్ సెంటర్‌లో శనివారం డాక్టర్ కత్తి పద్మారావు రచించిన 'సావిత్రిబాయి పూలే' 92వ గ్రంథావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (ఆది)	సహరి (సోమ)
నరసరావుపేట	6.22	5.10
గుంటూరు	6.20	5.08
బాపట్ల	6.20	5.08

ఏయ్ బిడ్డా..
ఇది మా అడ్డా!

కోటప్పకొండ తిరునాళ్లలో టీడీపీ నేతల దందా

- దుకాణదారుల నుంచి అక్రమ వసూళ్లు
- రశీదు ఇచ్చి మరీ దోపిడీ
- ఎమ్మెల్యే అనుచరులమంటూ బెదిరింపులు
- పంచాయతీ ఆదాయానికి గండి
- చర్యలకు వెనకడుగు వేస్తున్న అధికారులు



తిరునాళ్లలో ఏర్పాటైన దుకాణాలు

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ తిరునాళ్లలో టీడీపీ నాయకుల దందా ఆలస్యంగా వెలుగు చూసింది. తిరునాళ్లలో దుకాణాల నుంచి ఎమ్మెల్యే అనుచరులమంటూ వీరు పెద్దఎత్తున అక్రమ వసూళ్లకు పాల్పడ్డారు. తిరునాళ్ల సందర్భంగా కోటప్పకొండ జాతర జరిగే ప్రాంతంలో పెద్దఎత్తున దుకాణాలు ఏర్పాటు చేస్తారు. ప్రధాన రహదారికి ఇరువైపులతో పాటు ప్రభల వద్దకు వెళ్లే ప్రాంతంలో కూడా దుకాణాలు ఏర్పాటవుతాయి. ఈ దుకాణాల నుంచి గ్రామ పంచాయతీ కొంత రుసుము వసూళ్లు చేస్తుంది. ప్రతి ఏడాది సాధారణంగా జరిగే వ్యవహారం ఇది. వందల సంఖ్యలో ఏర్పాటయ్యే దుకాణాలు నుంచి రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతుంది.



ప్రైవేటు వ్యక్తులు ఇచ్చిన రశీదు

ప్రైవేటు స్థలంపై పెత్తనం

కొండ దిగువున జెడ్పీ స్థలం పక్కనే మెయిన్‌రోడ్డు వెంట ప్రైవేటు స్థలం ఉంది. ఈ స్థలంలో జెయింట్‌వీల్, ఇతర ఆటల పరికరాలు వంటి వాటిని ఏర్పాటు చేస్తారు. ప్రతి ఏడాది స్థానికంగా ఉన్నవారు స్థలయజమానితో ముందుగా ఒప్పందం చేసుకొని, కొంత లాభం చూసుకొని జెయింట్‌వీల్ నిర్వాహకులకు స్థలం అద్దెకు ఇస్తారు. టీడీపీ నాయకులు ఈ ఏడాది స్థానికులను బెదిరించి స్థల యజమానితో ఒప్పందం చేసుకొన్నారు. గత ఏడాది కంటే రెట్టింపు అద్దెను జెయింట్‌వీల్ నిర్వాహకుల నుంచి వసూళ్లు చేశారు.

కిమ్మనని అధికారులు

దుకాణాల నుంచి ప్రైవేటు వ్యక్తులు అక్రమ వసూళ్లు చేయడంపై పంచాయతీ రాజ్ అధికారులు చర్యలకు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈనెల 23 నుంచే ప్రైవేటు వ్యక్తులు అక్రమ వసూళ్లను ప్రారంభించారు. జిల్లా పంచాయతీ అధికారి తిరునాళ్ల మూడు రోజులు కోటప్పకొండలోనే ఉండి పారిశుద్ధ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ సమయంలో ఈ వ్యవహారం జిల్లా అధికారుల దృష్టికి వచ్చినట్టు సమాచారం. అయినా పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు చేయకపోవడం గమనార్హం.

పంచాయతీయే వసూలు చేయాలి

తిరునాళ్లలో ఏర్పాటైన దుకాణాల నుంచి పంచాయతీ సిబ్బంది రుసుము వసూలు చేస్తారు. ఈ సారి కూడా అలాగే సిబ్బంది వెళ్తే అప్పటికే ప్రైవేటు వ్యక్తులకు చెల్లించామని దుకాణదారులు తెలిపారు. దీంతో మా సిబ్బంది వెనక్కి రావాల్సి వచ్చింది. ప్రైవేటు వ్యక్తుల వసూళ్లతో పంచాయతీ ఆదాయానికి గండిపడిన మాట వాస్తవం.

– భాస్కరరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి

ఎమ్మెల్యే అనుచరులమంటూ..

కొండ దిగువ ప్రాంతంలో వెలిసే దుకాణాలపై ఈ ఏడాది టీడీపీ నాయకుల కన్ను పడింది. తిరునాళ్లకు మూడు రోజుల ముందు నుంచే కొండపై దుకాణాలు ఏర్పాటు అయ్యాయి. ఎమ్మెల్యే అనుచరులమంటూ కొందరు వీరి వద్దకు వెళ్లి దుకాణాలు ఏర్పాటు చేసుకున్నందుకు నగదు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇలా వసూలు చేసిన నగదుకు త్రికోటేశ్వర స్టాల్స్ అండ్ షాప్స్ రశీదు కూడా అందజేయడం కొసమెరుపు. పంచాయతీ సిబ్బంది రుసుము వసూళ్లకు వెళ్లగా వారు ఈ రశీదులు చూపించారు. దీంతో వెనుదిరిగినట్లు సమాచారం.



ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల వద్ద వేచిఉన్న విద్యార్థులు

- పరీక్ష కేంద్రాలను సందర్శించిన కలెక్టర్ అరుణ్‌బాబు
- తొలిరోజు 95.18 శాతం హాజరు నమోదు

నరసరావుపేట ఈస్ట్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు ప్రథమ సంవత్సరం సెకండ్ లాంగ్వేజ్ పరీక్షతో శనివారం ప్రశాంత వాతారణంలో ప్రారంభమయ్యాయి. సిద్ధంగా ఉంచిన మూడు సెట్ల ప్రశ్నపత్రాలలో సెట్–2 ప్రశ్నాపత్రాన్ని ప్రకటించారు. పరీక్షల తొలిరోజు కావటంతో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు పరీక్షా కేంద్రాల వద్దకు ఉదయం 8గంటలకే చేరుకున్నారు. విద్యార్థుల హాల్‌టిక్కెట్లు పరిశీలించి లోపలికి అనుమతించారు. జిల్లాలోని 48 పరీక్షా కేంద్రాలలో 18,481 మంది విద్యార్థులకు గాను 17,591మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. మరో 890మంది గైర్హాజరయ్యారు. వీరిలో జనరల్ విద్యార్థులు 17,313 మందికి గాను 16,554మంది హాజరు కాగా మరో 759మంది గైర్హాజరయ్యారు. అలాగే ఒకేషనల్ విద్యార్థులు 1,168మందికి గాను 1,037మంది హాజరు కాగా మరో 131మంది గైర్హాజరయ్యారు. ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని జిల్లా ఇంటర్మీడియెట్ విద్య అధికారి ఎం.నీలావతిదేవి తెలిపారు. జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పట్టణంలోని శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలలోని పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. పరీక్ష నిర్వహణ, మౌలిక వసతులను పరిశీలించి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, చీఫ్ సూపరింటెండెంట్ రాజనాల వేణుమాధవ్‌లకు పలు సూచనలు చేశారు. అలాగే జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు పట్టణంలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని సందర్శించి, పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. కాగా ఈనెల 3వతేదీ సోమవారం సెకండ్ లాంగ్వేజ్ పేపర్‌తో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానున్నాయి.



పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ అరుణ్‌బాబు

రేపటి నుంచి దూరవిద్య ఇంటర్ పరీక్షలు

నరసరావుపేట ఈస్ట్: సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో దూరవిద్య ఇంటర్మీడియెట్ పరీక్షలు సోమవారం నుంచి 15 వరకు నిర్వహిస్తున్నట్లు డీఈఓ ఎల్.చంద్రకళ శనివారం తెలిపారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 9 పరీక్షా కేంద్రాలలో 2,117మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతారని తెలిపారు. ఆయా కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లతో పాటు 103మంది ఇన్విజిలేటర్లు, 10 సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు, 2 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించినట్టు వివరించారు. విద్యార్థులు హాల్ టిక్కెట్లను సంబంధిత స్టడీ సెంటర్ల నుంచి, దూరవిద్య వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. సందేహాల నివృత్తికి హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. హెల్ప్‌డెస్క్ ఇన్‌ఛార్జ్ ఏపీఓ పి.శంకరరాజు (9963192487) ను సంప్రదించాలని తెలిపారు.

న్యూస్‌రీల్

లింగ నిర్ధారణకు పాల్పడితే కేసులు

నరసరావుపేట: జిల్లాలో గర్భస్థ లింగ నిర్ధారణకు పాల్పడే వారిపై కేసులు నమోదుచేసి కఠిన చర్యలు తీసుకుంటామని మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ డిస్ట్రిక్ లెవెల్ అడ్వైజరీ కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు హెచ్చరించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన కమిటీ సంయుక్త సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. అన్ని స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు 175 ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రులు లింగ నిర్ధారణ చట్ట పరిధి కింద అనుమతులు ఇవ్వటం జరిగిందని, వీరందరూ కూడా నిబంధనలకు లోబడి అన్ని రకాల రికార్డులను సక్రమంగా అమలు చేయాల్సి ఉందన్నారు. జిల్లాలో నూతనంగా రెండు స్కాన్ సెంటర్లు, రెండు రెన్యువల్స్‌కు, తొమ్మిది మార్పులకొరకు దరఖాస్తు చేసుకున్న వారికి అనుమతులు మంజూరు చేశారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రవి, నోడల్ అధికారి డాక్టర్ బి.గీతాంజలి, సత్తెనపల్లి గైనకాలజిస్టు డాక్టర్ శోభారాణి, డాక్టర్ లక్ష్మణరావు, డాక్టర్ గిరిరాజు, డెప్యూటీ డెమో కె.సాంబశివరావు, షేక్ ఖాజావలి పాల్గొన్నారు.

డీటీఓ శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరణ

నూతన జిల్లా ఖజానా, అకౌంట్స్ అధికారిగా కె.శ్రీనివాసరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ పి.అరుణ్‌బాబును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అమరావతిలో వేంచేసియున్న బాలచాముండికా సమేత అమరేశ్వర స్వామివారి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు శనివారం పూర్ణాహుతితో ముగిశాయి. తొలుత స్వామివారికి చూర్ణోత్సవంలో భాగంగా ఉత్సవమూర్తులకు స్నపన చేసి నూతన వస్త్రాలంకరణ చేశారు. అనంతరం స్వామివారికి వసంతోత్సవం నిర్వహించారు. ఆలయ స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖరశర్మ మాట్లాడుతూ రథోత్సవం పూర్తయిన స్వామివారికి చూర్ణోత్సవం, వసంతోత్సవం నిర్వహించటం ఆనవాయితీగా వస్తుందన్నారు. అనంతరం నిర్వహించే పూర్ణాహుతితో పంచాహ్నిక దీక్షతో నిర్వహించే బ్రహ్మోత్సవాలు ముగిశాయన్నారు. అలాగే రాత్రి 10 గంటలకు నిర్వహించే ధ్వజారోహణ కార్యక్రమంతో స్వామివారి ఏకాంతసేవా మహోత్సవాలు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు. వసంతోత్సవ అనంతరం స్వామివారిని పల్లకీలో గ్రామోత్సవం నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

'భరోసా' తగ్గించారు

తొమ్మిది నెలల్లో 10,161 పింఛన్ల తొలగింపు



నరసరావుపేట: ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పొందే వారి సంఖ్య జిల్లాలో క్రమంగా తగ్గిపోతుంది. గత తొమ్మిది నెలల కాలంలో 10,161మంది పింఛన్లను కూటమి సర్కారు కోత వేసింది. ఫిబ్రవరితో పోల్చితే మార్చి నెలకు 977 పింఛన్లు తగ్గాయి. గత నెల 2,72,932 మందికి అందజేయగా ఈనెల 2,71,955 మందికి అందజేయాల్సివుంది. ఒకటో తేదీ శనివారం నుంచి జిల్లాలో పంపిణీ మొదలు పెట్టగా సాయంత్రానికి 2,51,008 (92.30శాతం) మందికి అందజేశారు. జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు నరసరావుపేట పట్టణంలో స్వయంగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అందజేశారు. గత ప్రభుత్వం ముగిసి నూతన కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టేనాటికి జిల్లా వ్యాప్తంగా 2,82,126మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి గతేడాది జూలై మొదటి తేదీన నూతన ప్రభుత్వం పింఛన్లు అందజేసింది. ప్రస్తుత నెల లబ్ధిదారులతో పోల్చితే తొమ్మిది నెలల్లో 10,161మంది లబ్ధిదారులు తగ్గటం గమనార్హం.

ఉపమాసం ప్రారంభం

- మాసమంతా మహిమాన్వితమే!
- నేటి నుంచి నెలరోజులు కఠోర ఉపవాస దీక్షలు, దానధర్మాలు
- మత సామరస్యానికి ప్రతీక రంజాన్

యడ్లపాడు: రంజాన్ మాసం ముస్లింల జీవితాల్లో అత్యంత పవిత్రమైనది. చేతికి దానం..బుద్ధికి భక్తి..దేహానికి క్రమశిక్షణ..మనసుకు ప్రేమ ఒక్క నెలరోజులు అలవాటు చేసే అపురూప మాసమిది. హిజ్రీ క్యాలెండర్ ప్రకారం రమజాన్ అన్నది సంవత్సరంలోని 12 నెలల్లో 9వ నెల పేరు. షాబాన్ మాసం ముగిసే చంద్రదర్శనంతో రంజాన్ మాసం ఆరంభమవుతోంది. ముస్లింలందరూ నెలరోజులు రోజాతో ఆధ్మాత్మిక చింతన, భక్తిశ్రద్ధలతో గడిపే మాసం రంజాన్. ఈనెల ఆధ్యాత్మిక ప్రయాణానికి, మనో నిగ్రహానికి, మానవీయతకు ప్రతీక. శనివారం నెలవంక దర్శనం అయింది. దీంతో ఆదివారం నుంచి రోజా (ఉపవాసవ్రతం) ముస్లింలు చేపడతారు.

సహరీతో ఆరంభం ఇఫ్తార్‌తో విరమణ

సూర్యోదయానికి ముందే తీసుకునే ఆహారం(సహరీ) అనంతరం భగవంతుని అనుగ్రహాన్ని పొందే ఉద్దేశంతో ఉపవాసాన్ని పాటిస్తారు. దివ్య సూర్యకిరణాలు నడుస్తూ సాగిన అనంతర ఘడియలలో, దాహాన్ని, ఆకలిని అనుభవిస్తూ ఇబాదత్ ద్వారా మనస్సును నిర్మలంగా మార్చుకుంటారు. సూర్యాస్తమయం (ఇఫ్తార్) కాగానే కుటుంబసభ్యులు అంతా కలిసి సామూహికంగా పండ్లు, ఫలహారాలతో దీక్షను విరమిస్తారు. ఇది భౌతిక అవసరాలను మాత్రమే కాదు, మానసిక స్థైర్యాన్ని కూడా పరీక్షించే సమయం.



చిలకలూరిపేట బిలాల్ మసీదుకు రంగులు వేస్తున్న దృశ్యం

వీరికి మినహాయింపు..

రంజాన్ నెలలో బలమైన కారణం లేకుండా ఒక్క రోజును వదిలేసినా ఇక తర్వాత ఏడాదంతా ఉపవాసం పాటించినా సరే..దానితో సరితూగదన్నది ప్రవక్త బోధనల సారాంశం. అయితే బాలింతలు, రుతుక్రమంలో ఉన్న స్త్రీలు, రోగులకు ఇలా కొందరికి మాత్రం మినహాయింపు ఉంది. వీళ్లు ఉపవాసాలు చేయకపోయినా మిగతా రోజుల్లో పాటించి, ఆ సంఖ్యను పూరించాలన్నది ఖురాన్ ఉద్బోధ.

నెలవంక దర్శనం.. దీక్షలు ప్రారంభం

యడ్లపాడు: అత్యంత పవిత్రమైన రంజాన్ మాస ఉపవాస దీక్షలు (రోజా) ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. నియోజకవర్గంలో శనివారం సాయంత్రం మగ్రిబ్ నమాజు అనంతరం ముస్లింలు నెలవంక దర్శనం చేసుకుని ఆనందోత్సవాల్లో మునిగిపోయారు. మసీదులు, మదరసాలు, ముస్లిం వాడల్లో రంజాన్ ఆధ్యాత్మిక శోభ మొదలైంది. చంద్రదర్శనంతో ప్రత్యేక దువాలు నిర్వహించి, రోజా దీక్షను నిష్టగా కొనసాగించేలా అల్లాహ్ అనుగ్రహించాలని భక్తులు ప్రార్థించారు.

దయాగుణం..



రంజాన్ సాధారణ జీవితం నుంచి సమాజానికి ఉపయోగపడే సద్గుణాలను నింపి వారిలో దానగుణాన్ని పెంపొందిస్తుంది. సోదర భావాన్ని కలిగిస్తుంది. ఇదే ఇస్లాం మూల సూత్రాల్లో ప్రధానమైన లక్ష్యం. ఈ మాసంలో చేసే ఒక్కో ఆధ్మాత్మిక, సేవా కార్యానికి అల్లా 70 రెట్లు అధిక పుణ్యఫలం ప్రసాదిస్తారని ప్రవక్త బోధించారు. తమ సంపాదనలో 2.5 శాతం ధనాన్ని పేదలకు పంచాలని అల్లాహ్ ఖురాన్‌లో శాసనం చేశారు. సదఖా, జకాత్, ఫిత్రా దానాల ద్వారా ఈనెలలో పేదలకు ఆర్థిక సాయం విరివిగా అందుతుంది. దీంతో వారి అవసరాలు తీరి ఆనందోత్సవాలతో పండుగను జరుపుకొంటారు.

పెన్షన్ నగదుతో ఉడాయింపు



సచివాలయం-3 వద్ద పడిగాపులు కాస్తున్న పింఛన్‌దారులు

- రూ.8.43లక్షలతో వార్డు సెక్రటరీ పరారీ
- పోలీసులకు ఫిర్యాదు చేసిన కమిషనర్

దాచేపల్లి: పింఛన్‌దారుల సొమ్ము తీసుకుని వార్డు సెక్రటరీ పరారైన ఘటనపై నగర పంచాయతీ అధికారులు పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని వార్డు సచివాలయం–3లో వెల్ఫేర్ సెక్రటరీగా సంపతి లక్ష్మీప్రసాద్ విధులు నిర్వర్తిస్తున్నాడు. నాలుగు నెలల కిందట గుంటూరు నుంచి డిప్యూటేషన్‌పై వచ్చాడు. బ్యాంక్ నుంచి రూ.8.43 లక్షల పింఛన్ నగదు డ్రా చేసుకుని తన వద్ద పెట్టుకున్నాడు. ఇతను పిడుగురాళ్లలో నివాసం ఉంటున్నాడు. 200 మందికి పింఛన్ నగదు పంపిణీ చేయాల్సి ఉండగా.. ఉదయాన్నే పింఛన్ నగదు కోసం లబ్ధిదారులు ఎదురు చూశారు. ఉదయం 11 గంటలైన పింఛన్ నగదు పంపిణీ చేసేందుకు ఎవరూ రాకపోవటంతో పింఛన్‌దారులు నగర పంచాయతీ కమిషనర్ ఎంపీ అప్పారావుకు ఫిర్యాదు చేశారు. సచివాలయం–3 వద్దకు పింఛన్‌దారులు చేరుకుని పడిగాపులు కాశారు. ఎంతసేపటికీ సెక్రటరీ రాకపోవటంతో ఆందోళన చేశారు. లక్ష్మీప్రసాద్ ఆచూకీ కోసం కమిషనర్ ప్రయత్నాలు చేశారు. అతని సెల్‌ఫోన్ స్విచ్‌ఆఫ్ కావటంతో పిడుగురాళ్లలోని ఇంటికి సిబ్బందిని పంపి ఆరా తీస్తే అందుబాటులో లేడని తెలిసింది. దీంతో కమిషనర్ అప్పారావు దాచేపల్లి పోలీస్‌స్టేషన్‌లో లక్ష్మీప్రసాద్‌పై ఫిర్యాదు చేశారు. సీఐ భాస్కర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వార్డు సెక్రటరీ లక్ష్మీప్రసాద్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులకు నివేదిక పంపుతున్నట్లు కమిషనర్ అప్పారావు చెప్పారు.

సత్తెనపల్లిలో వడ్డీ వ్యాపారి ఆగడాలు

- రియల్ ఎస్టేట్ వ్యాపారికి రూ.40 లక్షలు ఇచ్చి రూ.కోటి ఇవ్వాలంటూ బెదిరింపులు
- మూడు రోజుల క్రితం కిడ్నాప్ చేసి చిత్రహింసలు
- ఎట్టకేలకు విడిపించిన పోలీసులు

సాక్షి,నరసరావుపేట: పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో వడ్డీ వ్యాపారి ఆగడాలు శృతిమించాయి. సత్తెనపల్లికి చెందిన పోలిశెట్టి ఆంజనేయ తరుణ్ రియల్ ఎస్టేట్ వ్యాపారంతో పాటు హోటళ్ల వ్యాపారాలు నిర్వహిస్తుంటాడు. గతంలో సత్తెనపల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట రాయల్ మండి బిర్యానీ హోటల్ సైతం నిర్వహించాడు. మూడు నెలల క్రితం వ్యాపార అవసరాల నిమిత్తం నగదు అవసరం కావడంతో బెల్లంకొండ మండలం చంద్రాజుపాలెంకు చెందిన వడ్డీ వ్యాపారి సయ్యద్ చిన్న మహబూబ్ అలియాస్ నన్నే అలియాస్ చిన్నా వద్ద రూ.40 లక్షలు అరువుగా తీసుకున్నాడు. దానికి వారం రోజుల క్రితం మరో రూ.60 లక్షలు వడ్డీ కలిపి మొత్తం రూ.కోటి ఇవ్వాలంటూ ఆంజనేయ తరుణ్‌ను సయ్యద్ చిన్న మహబూబ్ అలియాస్ నన్నే అలియాస్ చిన్నా వేధింపులకు గురి చేస్తున్నాడు. గత నెల 25న పోలిశెట్టి ఆంజనేయ తరుణ్‌ను నన్నేతో పాటు మరో ముగ్గురు కలిసి కారులో ఎక్కించుకొని కిడ్నాప్ చేశారు. చంద్రాజుపాలెం, పులిచింతల డ్యామ్, బెల్లంకొండ, గుంటూరు తదితర ప్రాంతాలకు కారులో తిప్పుతూ చిత్రహింసలకు గురి చేశారు. ఆంజనేయ తరుణ్ ఎడమ చేయి మణికట్టు వద్ద మూడు అంగుళాల మేకును సైతం దించారు. అంతేకాక ఇనుప రాడ్డుతో దాడి చేసి మలద్వారంలోకి ఆ రాడ్డును దించారు. తట్టుకోలేక విలపిస్తుంటే రూ.కోటి డబ్బులు ఇవ్వకపోయినా, పోలీసుల దగ్గరకు వెళ్లినా నీ కొడుకును చంపేస్తామంటూ తరుణ్ తండ్రి ఆంజనేయ శ్రీనివాస్‌కు ఫోన్ చేసి బెదిరింపులకు గురి చేశారు. దీనిపై వచ్చిన ఫిర్యాదు మేరకు సత్తెనపల్లి పోలీసులు రంగంలోకి దిగారు. సెల్‌ఫోన్ సిగ్నల్ సాధారణంగా ట్రేస్ చేయగా పేరేచర్లలో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో సంఘటనా స్థలానికి చేరుకొని ఆంజనేయ తరణ్‌ను విడిపించి కిడ్నాపర్లు నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. బాధితుడి ఆరోగ్య పరిస్థితి సక్రమంగా లేకపోవడంతో సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు.

కూటమి నేతల అండతో రౌడీషీట్ ఎత్తివేత....

వడ్డీ వ్యాపారి సయ్యద్ చిన్న మహబూబ్ అలియాస్ నన్నే అలియాస్ చిన్నా పై గతంలో కూడా అనేక ఆర్థిక పరమైన నేరాలకు సంబంధించిన కేసులు ఉన్నాయి. అవసరాలకు నగదు ఇచ్చి అత్యధిక వడ్డీలు వసూలు చేసేవాడు. డబ్బు తిరిగి ఇవ్వకపోతే చిత్రహింసలకు గురి చేస్తుంటాడు. ఈ నేపథ్యంలోనే ఇతనిపై పోలీసులు రౌడీషీట్ కూడా తెరిచారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇటీవల రౌడీషీట్‌ను ఎత్తివేశారు. దీంతో మళ్లీ ఆగడాలు శృతి మించాయి. ప్రస్తుతం కేసును కూడా నీరుగార్చేందుకు కూటమి నేతలు యత్నిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

క్లుప్తంగా

గుంటూరును విద్యా రాజధానిగా తీర్చిదిద్దిన భాష్యం



గుంటూరు ఎడ్యుకేషన్: జేఈఈ, నీట్ వంటి జాతీయస్థాయి పోటీ పరీక్షల్లో వరుసగా అత్యుత్తమ ర్యాంకులను సాధించడం ద్వారా గుంటూరు నగరాన్ని భారతదేశ విద్యా రాజధానిగా భాష్యం రామకృష్ణ తీర్చిదిద్దారని మానవత సేవా సంస్థ విద్యా కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ నూతలపాటి అరవింద్ అన్నారు. భాష్యం రామకృష్ణ పుట్టినరోజు సందర్భంగా శనివారం చంద్రమౌళీనగర్‌లోని మెయిన్ క్యాంపస్‌లో ఆయన్ను కలిసి అభినందనలు తెలియజేశారు. మానవతా సంస్థ చైర్మన్ పావులూరి రమేష్, నగర అధ్యక్ష, కార్యదర్శులు కొమ్మాలపాటి శ్రీధర్, సతీష్, యునైటెడ్ వాకర్స్, సెంటర్ ఫర్ సోషల్ సైకాలజీ, తెలుగు రైతు సంస్థలకు చెందిన ప్రతినిధులు డాక్టర్ నిమ్మల శేషయ్య, ప్రొఫెసర్ వైవీ రెడ్డి, చావా శివాజీ, లక్ష్మి, సాయిరాం, తెలుగు రైతు నాయకులు తాతిరెడ్డి లక్ష్మారెడ్డి తదితరులు భాష్యం రామకృష్ణను అభినందించారు.

కారు అదుపుతప్పి మహిళ మృతి

మాచర్ల రూరల్: వేగంగా వస్తున్న కారు అదుపు తప్పి బోల్తాపడి ఒక మహిళ మృతి చెందిన ఘటన కొత్తపల్లి జంక్షన్ వద్ద శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. కారంపూడి మండలం ఒప్పిచర్ల గ్రామానికి చెందిన భార్యా,భర్తలైన జి.ప్రకాష్, ప్రసన్నలక్ష్మి (35)లు హైదరాబాద్ నుంచి స్వగ్రామమైన కారంపూడి మండలంలోని ఒప్పిచర్లకు వస్తున్న సమయంలో కొత్తపల్లి జంక్షన్ వద్ద కారు అదుపు తప్పి పక్కనే ఉన్న డొంక రోడ్డులో పల్టీ కొట్టింది. ఈ ఘటనలో ముందు సీట్లో కూర్చున్న ప్రసన్నలక్ష్మి సీటు బెల్టు పెట్టుకోకపోవటంతో కారులోంచి కిందపడి మృతి చెందింది.

మోసంలో పీహెచ్‌డీ చేసిన బాబు

- వరికెపుడిశెల ప్రాజెక్టుకు తీరని అన్యాయం
- ఉద్యోగులు, నిరుద్యోగులకూ మోసం
- మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ధ్వజం

సూపర్ 6ను మడతేసిన కూటమి సర్కారు

నరసరావుపేట: రాష్ట్రంలో టీడీపీ కూటమి సర్కార్ ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ తీరు గమనిస్తే గత ఎన్నికల్లో చంద్రబాబునాయుడు ప్రజలకు ఇచ్చిన హామీలు ఎక్కడ నిలబెట్టుకోకుండా మోసం చేశారని, అందులో ఆయన పీహెచ్‌డీ చేశారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ధ్వజమెత్తారు. శనివారం సాయంత్రం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తల్లికి వందనం పథకానికి 80 లక్షల మంది విద్యార్థులకు రూ.13,113 కోట్లు అవసరమైతే కేవలం రూ.9407కోట్లు మాత్రమే కేటాయించి దాదాపు 24 లక్షల మంది విద్యార్థులకు పంగనామం పెట్టబోతున్నారన్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి 55 లక్షల మంది రైతులకు రూ.10,717 కోట్లు అవసరం కాగా, బడ్జెట్‌లో రూ.6,300 కోట్లు కేటాయించారంటే 22 లక్షల మంది అన్నదాతలకు ఎగనామం గ్యారెంటీ అన్నారు. దీపం పథకానికి ఈ ఏడాది రూ.4వేల కోట్లు అవసరమైతే రూ.2,600 కోట్లు మాత్రమే కేటాయించారని విమర్శించారు. 1.50 లక్షల దీపం కుటుంబాలు ఉంటే 90 లక్షల మందికి నిధులు కేటాయించి 58 లక్షల పైచిలుకు మందికి ఎగ్గొడుతున్నారన్నారు. ఉచిత బస్సుకు రూ.3,600 కోట్లు అవసరమైతే ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని, అసలు ఈ పథకం



పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

అమలు చేస్తారా లేదా అనేది తెలియని సందిగ్ధం నెలకొందని గోపిరెడ్డి పేర్కొన్నారు. గత 20ఏళ్ల నుంచి చంద్రబాబు ఎన్నికల ముందు ఎప్పుడూ నిరుద్యోగ భృతి ఇస్తానని చెబుతూనే ఉన్నాడని, ఇంతవరకు ఎక్కడా ఈ పథకాన్ని నెరవేర్చిన పాపాన పోలేదని, ఈ బడ్జెట్‌లో నిరుద్యోగ భృతి ఊసేలేదని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ ,బీసీ మహిళలకు 50 ఏళ్లకే పెన్షన్ అమలుచేస్తానని వాగ్దానం చేసి బడ్జెట్‌లో ప్రస్తావించలేదని అన్నారు. నాడు–నేడు పథకానికి రూ.8వేల కోట్లు అవసరమైతే గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.4వేల కోట్లు కేటాయించారని, మరో రూ.4వేల కోట్లు కేటాయిస్తే మిగిలిన పనులు పూర్తయ్యేయని, కానీ బడ్జెట్లో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కేవలం రూ.100కోట్లు మాత్రమే కేటాయించారని వివరించారు. 20 లక్షల ఉద్యోగాలు ఇస్తానని ఎన్నికల ముందు వాగ్దానం చేశారని, ఇంతవరకు ఒక్క ఉద్యోగం కూడా ఈ ప్రభుత్వం ఇవ్వలేదని అన్నారు.

డీఎస్సీ ఊసేదీ?

ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలైనా మెగా డీఎస్సీ ఊసే లేదనీ, ఎన్టీఆర్ భరోసా పింఛన్లకు రూ.5వేల కోట్లు తగ్గించారని, రానున్న రోజుల్లో సుమారు 10 లక్షల పింఛన్ల ఎత్తివేతకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందని గోపిరెడ్డి విమర్శించారు. మొత్తం మీద చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలు అన్నిటికీ పంగనామం పెట్టారని ఎద్దేవా చేశారు. వరికెపుడిశెల ప్రాజెక్టును పూర్తిగా పక్కన పెట్టేశారన్నారు. పల్నాడు ప్రాంతానికి ఈ బడ్జెట్లో తీరని అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉద్యోగులకు ద్రోహం

ఉద్యోగులకు 29 శాతం ఐఆర్, 23 శాతం పీఆర్సీ గతంలో వైఎస్ జగన్ ప్రకటించారని, 23 శాతం అందించడం జరిగిందనీ, కానీ ప్రస్తుత ప్రభుత్వం దీనిపై కనీసం ఒక ప్రకటన కూడా చేయలేని స్థితిలో ఉందని గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. ఉద్యోగస్తుల్లో ఈ విషయంపై తీవ్ర వ్యతిరేకత నెలకొని ఉన్నా ప్రస్తుతం ఎవరూ బయటపడటంలేదనీ అన్నారు.

కార్మిక శాఖ అధికారిని అంటూ వ్యక్తి హల్‌చల్

సత్తెనపల్లి: సత్తెనపల్లి పట్టణంలో సహాయ కార్మిక శాఖ అధికారిని అంటూ ఓ వ్యక్తి హల్‌చల్ చేశాడు. పట్టణంలోని పలు దుకాణాల వద్దకు ఓ వ్యక్తి శుక్రవారం వెళ్లి సహాయ కార్మిక శాఖ అధికారిగా పరిచయం చేసుకుని లైసెన్స్ రెన్యూవల్ పేరిట పలు షాపుల్లో అక్రమ వసూళ్లకు పాల్పడ్డాడు. అయితే అతడిని నకిలీ అధికారిగా గుర్తించిన వ్యాపారులు కార్మిక శాఖ అధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. తమ శాఖ తరఫున ఎలాంటి లైసెన్స్ రెన్యూవల్ చేయడం లేదని వారు చెప్పడంతో వ్యాపారులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు శుక్రవారం రాత్రి షాపుల వద్దకు చేరుకొని వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారణ చేశారు. ముప్పాళ్లకు చెందిన కందుల వెంకయ్యగా గుర్తించారు. మూడు రోజులుగా పట్టణంలోని పలు దుకాణాల వద్ద రూ.వెయ్యి నుంచి అందినకాడికి దండుకున్నట్టు వ్యాపారులు తెలిపారు. మాచర్ల, పిడుగురాళ్ల, తదితర మున్సిపాలిటీలలోనూ వెంకయ్య వసూళ్లకు పాల్పడినట్టు పోలీసుల విచారణలో తేలింది.



నిందితుడు వెంకయ్య

కూటమి బడ్జెట్ మోసపూరితం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ మొత్తం మోసమేనని వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు విమర్శించారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని పథకాలూ అమలు చేస్తామని చంద్రబాబు, హామీలు కచ్చితంగా అమలు చేసేలా చూసుకుంటామని పవన్ మాట్లాడిన మాటలను ప్రజలు మర్చిపోలేదని పేర్కొన్నారు. కనీసం ప్రటించిన పథకలకన్నా పూర్తిస్థాయి కేటాయింపులు చేయలేకపోవడం దారుణమని ధ్వజమెత్తారు. తల్లికి వందనం, అన్నదాతా సుఖీభవ వంటి పథకాలకు సగం నిధులను కేటాయించడం, మహిళలకు ఉచిత బస్సు, ప్రతి మహిళకు ప్రతి నెలా రూ.1500 ఇస్తామని నమ్మబలికి వాటి ప్రస్తావనే బడ్జెట్‌లో లేకపోవడం ప్రజలను దగా చేయడమేనని బొల్లా విమర్శించారు. పల్నాడు ప్రాంతానికి జీవనాడిలాంటి వరికపూడిశెల ప్రాజెక్టుకు ఒక్క రూపాయి కూడా బడ్జెట్ కేటాయించకపోవడంపై బొల్లా ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో వరికపూడిశెల పథకానికి అన్ని రకాల అనుమతులను తీసుకురావడంతోపాటు శంకుస్థాపన చేసి కొంత నిధులనూ కేటాయించామని వివరించారు. ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఎన్నికలకు ముందు అధికారంలోకి వచ్చిన నెలలోనే వరికపూడిశెల పూర్తిచేస్తామని ప్రగల్భాలు పలికారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వానికి ప్రతిపక్షాలపై పగ తీర్చుకోవడానికే సమయం సరిపోతోందని, పాలనను పట్టించుకోవడం లేదని బొల్లా బ్రహ్మనాయుడు విమర్శించారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై ప్రభుత్వం వేధింపులకు దిగుతోందని, పోలీసులు దీనికి వంతపాడుతున్నారని బొల్లా ధ్వజమెత్తారు.

వ్యవసాయ బడ్జెట్‌పై చిత్తశుద్ధేదీ!

వైఎస్సార్‌సీపీ రైతు విభాగ జిల్లా అధ్యక్షులు పున్నారెడ్డి

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వ్యవసాయ బడ్జెట్ చూస్తే కూటమి సర్కారుకు చిత్తశుద్ధి ఉన్నట్టు కనపడడం లేదని వైఎస్సార్‌సీపీ రైతు విభాగ జిల్లా అధ్యక్షులు అన్నెంపున్నారెడ్డి విమర్శించారు. ఈ మేరకు శనివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. అన్నదాత సుఖీభవ పథకానికి రూ.10,700కోట్లు కావాల్సి ఉండగా, కేవలం రూ.6,300 కోట్లు కేటాయించడమేమిటని ప్రశ్నించారు. ధరల స్థిరీకరణ నిధికి కేవలం రూ.300కోట్లు మాత్రమే కేటాయించారని, అదే గత ప్రభుత్వంలో రూ.3వేల కోట్లు కేటాయించారని వివరించారు. ప్రకృతి వైపరీత్యాల సహాయనిధి, రైతు సేవా కేంద్రాల గురించి బడ్జెట్లో ఊసేలేదని విమర్శించారు. భూసార పరీక్షలు చేసే అగ్రి ల్యాబ్ నిర్వహణకూ నిధులు ఇవ్వలేదని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వంలో రైతులు గిట్టుబాటు ధరలు లేక అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాగార్జునసాగర్ ఆయకట్టు కింద కొన్ని వేల ఎకరాల్లో రెండో పంట సాగు చేశారని, సాగునీరు విషయంలో అవగాహన లేకుండా అధికారులు వారబందిగా సాగునీరు ఇస్తామని ప్రకటన చేశారని విమర్శించారు. గత ప్రభుత్వం కౌలు రైతులకూ పథకాలు వర్తింపజేసిందని, కూటమి ప్రభుత్వం ఆ విషయం గురించి మాట్లాడడం లేదని ధ్వజమెత్తారు.. ఇప్పటికైనా రైతులకు న్యాయం చేయకపోతే వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లాలోని మిగతా నియోజకవర్గ ఇన్‌చార్జీల అందరితో కలిసి రైతు పోరుబాట కార్యక్రమం నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

అమరావతి: మండలంలోని మండెపూడి గ్రామ పరిధిలో శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మరణించాడు. పోలీసుల కథనం ప్రకారం.. శనివారం మధ్యాహ్నం 75 త్యాళ్లూరు నుంచి గుంటూరు వెళ్తున్న ఏపీఎస్ ఆర్టీసీ బస్ మండెపూడి గ్రామం వద్ద రోడ్డు దాటుతున్న పల్లెపోగు వెంకటేశ్వరరావును ప్రమాదవశాత్తు ఢీకొట్టింది. ఘటనలో పల్లెపోగు వెంకటేశ్వరరావు (70) అక్కడికక్కడే మరణించాడు. అమరావతి పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వెంకటేశ్వరరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమరావతి కమ్యూనిటి హెల్త్ సెంటర్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్‌ను అమరావతి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

పది విద్యార్థుల సందేహాల నివృత్తి

డీఈఓ కార్యాలయంలో ర్యాంక్ సాధన కార్యక్రమం

నరసరావుపేట ఈస్ట్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా జిల్లా విద్యాశాఖాధికారులు చర్యలు చేపట్టారు. ఈనెల 17 నుంచి పరీక్షలు ప్రారంభం కానుండటంతో శనివారం జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ ఆధ్వర్యంలో సబ్జెక్ట్ నిపుణులతో ర్యాంక్ సాధన కార్యక్రమం నిర్వహించారు. డీఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ వెబ్ బాక్స్ ద్వారా జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్యంలోని విద్యార్థుల సందేహాలకు సబ్జెక్ట్ నిపుణులు సమాధానాలిచ్చారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా డీఈఓ చంద్రకళ మాట్లాడుతూ, జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 500 మార్కులకుపైబడి వచ్చే విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించే దిశగా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు.

యడ్లపాడు విద్యార్థిని ప్రతిభకు రాష్ట్రస్థాయి గౌరవం

చిలకలూరిపేటటౌన్: పట్టణంలోని శ్రీ చైతన్య టెక్నోస్కూల్ -2 బ్రాంచ్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థిని రావిపాటి ఉషశ్రీ, ఆమె బృందం రూపొందించిన నాసా ప్రాజెక్ట్ రాష్ట్రస్థాయిలో ఎంపికైంది. యడ్లపాడు గ్రామానికి చెందిన ఉషశ్రీ అద్భుతమైన నైపుణ్యంతో చేసిన ఈ ప్రాజెక్ట్‌కు విశేషమైన గుర్తింపు లభించడంతో, స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఉషశ్రీతోపాటు బృందసభ్యుల్ని శనివారం అభినందించారు. ఆయన మాట్లాడుతూ 'మన ప్రాంతం నుండి ఇటువంటి ప్రతిభావంతులైన విద్యార్థులు వెలుగులోకి రావడం గర్వించదగిన విషయమన్నారు.

మహిళా పోలీసుల కోసం మెడికల్ క్యాంపు

ప్రారంభించిన ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట: పోలీసులు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని ఎస్పీ కంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం మహిళా పోలీసులు, సచివాలయ మహిళా పోలీసుల కోసం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఉచిత మెడికల్ క్యాంపును ఎస్పీ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. మ్యాక్సీ విజన్ కంటి వైద్యశాల డాక్టర్ రామలింగారెడ్డి, కొండవీడు ఈఎన్‌టీ హాస్పిటల్, గాయత్రి స్కిన్ కేర్ వైద్యశాల, లిఖిత ఆర్థో వైద్యశాల, హనివ్రత జనరల్ వైద్యశాల, వసంత డెంటల్ కేర్ వైద్యశాల, హిమబిందు గైనిక్ వైద్యశాల డాక్టర్లు, సిబ్బంది పాల్గొని 151 మంది మహిళా సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఎస్పీ పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలోని ఎస్సీ, ఎస్టీ బాలికల వసతి గృహాన్ని పరిశీలించారు. చట్టపరంగా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. అదనపు ఎస్పీ (పరిపాలన) జేవీ. సంతోష్, ఏఆర్ అదనపు ఎస్పీ వి.సత్తిరాజు, మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ వెంకటరమణ, వెల్ఫేర్, అడ్మిన్, హోంగార్డు ఆర్‌ఐలు గోపీనాథ్, రాజా, కృష్ణ పాల్గొన్నారు.



ఉచిత మెడికల్ క్యాంపును పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

జిల్లా సైన్స్ క్విజ్ పోటీలో ద్వితీయ స్థానం

నరసరావుపేటరూరల్: జిల్లా స్థాయి సైన్స్ క్విజ్ పోటీలలో ఉప్పలపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాసరావు శనివారం తెలిపారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం జిల్లా స్థాయి సైన్స్ క్విజ్ పోటీలు నిర్వహించినట్టు తెలిపారు. ఈ పోటీలలో జిల్లాలోని 20 పాఠశాలల నుంచి టీమ్‌లు పాల్గొన్నాయని వివరించారు. పాఠశాల విద్యార్థులు టీవీ కల్యాణ్, వర్షిత, మహాలక్ష్మిలు పోటీలో పాల్గొని ప్రతిభ కనబర్చి ద్వితీయ స్థానం పొందారని తెలిపారు. విద్యార్థులను శనివారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, సైన్స్ ఉపాధ్యాయుడు ఏఏ మధుకుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు

ఖరీఫ్ ప్రణాళికకు సిద్ధంగా ఉండాలి

నరసరావుపేట రూరల్: 2025–26 ఖరీఫ్ ప్రణాళిక రూపొందించేందుకు క్యాడర్ సిద్ధంగా ఉండాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి తెలిపారు. ఖరీఫ్ ప్రణాళికపై జిల్లా కార్యాలయంలో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అమలకుమారి మాట్లాడుతూ జిల్లాలో ప్రతి ఒక్క రైతు తమ పంట సాగు చేసే విధానం, కుటుంబ వ్యక్తిగత వివరాలను సేకరించేందుకు (ఆర్ వై ఎస్ ఎస్) రైతు సాధికార సంస్థ, ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో ఈ సంవత్సరం ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ రూపొందిస్తామనితెలిపారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ డీపీఎం ప్రేమ్ రాజు, జిల్లా సిబ్బంది ఎస్‌ఎఫ్‌ఏలు, నందకుమార్, సైదయ్య,సౌజన్య, మేరీ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎం అమలకుమారి

రేపు, ఎల్లుండి పల్నాటి వెంకన్న తిరునాళ్ల మహోత్సవం

గురజాల : పల్నాటి వెంకన్న క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన జంగమహేశ్వరపురం శ్రీ అలివేలు మంగా పద్మావతీ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాలు ఆది, సోమవారాల్లో జరగనున్నాయి. ఈ సందర్భంగా తిరునాళ్లకు కమిటీ సభ్యులు సర్వం సిద్ధం చేశారు. ఆదివారం ఉదయం స్వామికి హోమం, బలిహరణం, ఎదురుకోలు ఉత్సవం నిర్వహిస్తామని, అన్నసంతర్పణ కార్యక్రమ జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. మధ్యాహ్నం సమయంలో అలివేలుమంగా పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం, సాయంత్రం కోలాట ప్రదర్శన నిర్వహిస్తారని వెల్లడించారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఉంటుందని వివరించారు. 3న హోమం, బలిహరణము, గరుడసేవ, పూర్ణాహుతి, నాగవల్లి, ఉద్వాసన, ధ్వజపట ఉద్వాసన, 4న హనుమంత్ వాహనసేవ, రథోత్సవం, వసంతసేవ నిర్వహించనున్నట్టు వెల్లడించారు.



అలంకరణలో వేంకటేశ్వరస్వామి



తిరునాళ్లకు సిద్ధంగా ఉన్న వేంకటేశ్వరస్వామి గుడి

